గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

అప్పారెడ్డిగూడలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్

- జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్

నందిగామ, అక్టోబర్ 24 : బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. వీర్లపల్లి, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి, నాయకులు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. పార్టీలో కొత్త, పాత అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి పని చేయాలన్నారు. నెల రోజుల పాటు కష్టపడి పని చేస్తే ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రజలకు సేవ చేస్తారని తెలిపారు. పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ తగిన విధంగా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కట్న లత, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, సర్పంచ్‌లు నర్సింహులు, గోవిందు అశోక్, జట్ట కుమార్, కో ఆప్షన్ మెంబర్ బేగ్, నాయకులు శ్రీశైలం, బంటారం సుదర్శన్‌గౌడ్, జంగిలి కుమార్, రజినీకాంత్‌గౌడ్, సములయ్య, ఆంజనేయులు, పాండు, రమేశ్, నర్సింహ, మల్లేశ్, పాషా, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో దసరా

- పూజల అనంతరం జమ్మి ఆకు పెట్టి శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజలు
- బతుకమ్మ ఆడిన మహిళలు
- వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

ఎక్లాస్‌ఖాన్‌పేటలో జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 24: విజయదశమి పర్వదినాన్ని షాద్‌నగర్ పట్టణ ప్రజలు సోమవారం అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దేవాలయాలు కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తబట్టలను ధరించి సాయంత్రం వేళలో పలు దేవాలయాల్లో నిర్వహించిన శమీ పూజలో పాల్గొని ఒకరికొకరూ దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. గ్రామాల్లోని ప్రజలు, యువకులు పంట పొలాల్లోకెళ్లి పాలపిట్టలను చూశారు. శివమారుతిగీతా అయ్యప్ప మందిరం నుంచి పాల శీతలీకరణ కేంద్రం వరకు శివపార్వతుల పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి శమీ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మండల, మున్సిపాలిటీ లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గామాత విగ్రహ నిమర్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మహేలింగాపురం గ్రామంలో దుర్గామాత ఊరేగింపు కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మాచన్నగారి రాఘవేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలంలో అమ్మవారి ముక్కుపుడకను రూ.1.80 లక్షలకు దక్కించుకున్నారు. మండలంలోని మిర్జాగూడ గ్రామంలో ఉప సర్పంచ్ శాంతీ కిషన్ సింగ్ ఆధ్వర్యంలో దుర్గామాత ఊరేగింపు మేళా తాళాలలో అంగరంగా వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్ పాల్గొన్నారు.

కనుల విందుగా దుర్గామాత శోభా యాత్ర

మొయినాబాద్ : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు భక్తుల నుంచి విశేష పూజలందుకున్న దుర్గా మాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కళాకారుల బృందం చేసిన నృత్యాలు, డప్పుల దరువులు, డోలు వాయిద్యాల చప్పుడు ఆకట్టుకున్నాయి. పెద్దమంగళారం, సురంగల్, మేడిపల్లిల, శ్రీరాంనగర్, చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామాల్లో దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర కనుల విందుగా నిర్వహించారు.

షాబాద్ : విజయదశమి వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. కొత్త బట్టలు ధరించి స్థానికంగా ఉన్న దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు జరిపిన భక్తులు, తెలంగాణ ప్రాంతంలో బంగారమని పిలుచుకునే శమీపత్రాలు(జమ్మిఆకులు)ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు నగరంలో మంత్రులు సబితాఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డి, జడ్పీ టీసీ పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులను కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రోత్సవాలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు షాద్‌నగర్ పట్టణంలో భక్తిశ్రద్ధలతో ముగిశాయి. పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో, పెద్ద జానమ్మపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారు మహిషాసురమర్ధినిదేవి అలంకరణలో పూజలందుకుంది.

కేశంపేట : కేశంపేట మండలంలోని గ్రామాల్లో సోమవారం దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గ్రామస్తులతో కలిసి ఊరేగింపుగా జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు పండుగ శుభాకాంక్షలను తెలిపారు. కేశంపేట, కొత్తపేట తదితర గ్రామాల్లో ప్రజలు ఘనంగా దసరా వేడుకలను జరుపుకున్నారు.

చేవెళ్లటౌన్ : చేవెళ్ల మండల కేంద్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సోమవారం 3గంటలకు స్వామివారిని ఊరేగింపుగా పుష్కరిణీలో తెప్పోత్సవం నిర్వహించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర ఉదయం నుంచి సాయంత్రం వరకు వైభవంగా కొనసాగింది. చేవెళ్లలోని పుష్కరిణీలో నిమజ్జనం చేశారు. అనంతరం రాత్రి 9గంటలకు లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం ముందు జమ్మిచెట్టుకు పూజచేసి అశ్వవాహనం పై స్వామి వారు ఊరేగుతు గ్రామంలోని ప్రజలకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాలతి, ఎంపీపీ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, సర్పంచ్ శైలజ, మాజీ ఉప సర్పంచ్ టేకుల పల్లి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మొయినాబాద్ : సురంగల్‌లో దుర్గామాత శోభాయాత్ర

షాబాద్: చిన్న సోలీపేటలో విజయదశమి సందర్భంగా జమ్మి చెట్టు వద్ద శమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్, తదితరులు

కేశంపేట అక్టోబర్ 24 : కేశంపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని సోమవారం ఎంపీపీ రవీందర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభ్యర్థి అంజయ్యయాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, శ్రీశైలంగౌడ్, ఎంపీటీసీలు మల్లేశ్‌యాదవ్, నాయకులు యాదగిరిరావు, నారాయణరెడ్డి, విశ్వనాథం, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్, శేఖర్, వెంకటయ్య, పర్వత్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌గౌడ్, చంద్రశేఖర్, వెంకటేశ్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

చందనవెల్లిలో క్రీడాకారులు అందించిన డబ్బులతో పేద కుటుంబానికి సరుకులనుఅందజేస్తున్న సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

షాబాద్, అక్టోబర్ 24: క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, చందనవెల్లి గ్రామ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండలంలోని చందనవెల్లి గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. విజేతలకు సర్పంచ్ తన సొంతంగా రూ.15వేలు నగదు, బహుమతులు అందజేశారు. విజేతలు తీసుకున్న నగదును పెద్ద మనస్సుతో అదే గ్రామానికి చెందిన కంకంటి నర్సింహులు కుటుంబానికి దసరా పండుగ సందర్భంగా నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి ఆ కుటుంబానికి అందజేశారు. దీంతో యువకులను సర్పంచ్ అభినందించారు. అదే విధంగా తనవంతు సహాయంగా వారు ఉండేందుకు ఒక గది నిర్మించి ఇస్తానని తెలిపారు. త్వరలో క్రీడా ప్రాంగణంలో ఓపెన్ జిమ్, హెమాస్ట్ లైట్లు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రమీల, యువకులు సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కేశంపేట, అక్టోబర్ 24 : కేశంపేట మండలం కొత్తపేట గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామానికి చెందిన పాలాది భరత్ (22) దసరా పండుగ రోజున బైక్‌పై బైర్‌ఖాన్‌పల్లిలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. కేశంపేటలోని అమ్మమ్మ వాళ్ల ఇంటికి వస్తుండగా కొత్తపేట శివారులో రోడ్డుపై ఆపి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ప్రమాదవశాత్తు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి చిన్నాన్న పాలాది జగన్‌మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.